## 281 నూతన నిబంధన విందు

రా - భైరవి (చాయ :యేసుక్రీస్తు దొరికెనేని) తా - చాపు

మానవుఁడవై సకల నరుల - మానక నా దోషములఁ - బాపుటకు బలి యైతివే యేసూ - బహు ప్రేమతోడ ॥మానవుఁడవై॥

1. నీదు బలిని నిత్యముగను - నిజముగా ధ్యానించి ప్రేమను - నీదు దివ్య ప్రేమ నొందుటకు - నియమంబు నిచ్చి ॥మానవుఁడవై॥
2. నీవె జీవపు రొట్టె వంటివి - నీవె జీవ జలంబు వంటివి - నిన్ను ననుభ వించుఁడంటివిగా - నిజదేవా యేసూ ॥మానవుఁడవై॥
3. నీ శరీరము రొట్టెవలెనే - నిజముగా విరువంగఁబడెనే - నిన్నుఁ దిను భాగ్యంబు నిచ్చితివే - నా యన్న యేసూ ॥మానవుఁడవై॥
4. మంచి యూట మించి దండి - పంచగాయములలో నుండి - నిత్యజీవపు టూటలు జేసితి - నీ ప్రేమ నుండి ॥మానవుఁడవై॥
5. నిన్ను జ్ఞాపక ముంచుకొనుటకు - నీదు ప్రేమ బలిలో మనుటకు - నిత్య మాచరించుఁడంటివి నీ - నిజభక్తితోడ ॥మానవుఁడవై॥
6. ఎంతో ప్రేమతో బలిగా నైతివి - యెంతో ప్రేమాచారమైతివి - చింతలును నా పాపములు బాప - శ్రీ యేసు దేవా ॥మానవుఁడవై॥
7. నిత్యబలి యగు నిన్నే నమ్మి - నిన్ను ననుభవించి నెమ్మి - నిన్ను నిముడించుకొని నాలో నీ- నిజరూప మొంద ॥మానవుఁడవై॥
8. నేను నీ బలిలోనఁ గలిసి - నేను నీతోఁ గలిసి మెలిసి - నేను నీవలె నుండఁ జేసితివే - నా దివ్య యేసూ ॥మానవుఁడవై॥
9. నీదు శ్రమలను బలిని నిపుడు - నాదు కనులు చూడ నెపుడు - నాదు పాపభారములు దిగునే - నా దివ్య యేసూ ॥మానవుఁడవై॥
10. నీవు బలియై తిరిగి లేచి - నిత్య తేజోరూపు దాల్చి - నిత్యమును నా బంతి నున్నావే - నిజ దేవా యేసూ ॥మానవుఁడవై॥
11. నీవే నీ చేతులతో నిత్తువు - ఈ నీ బలివిందునకు వత్తువు - నిన్ను నిట జూచితిని నా యేసూ! యెన్నఁడును మరవను ॥మానవుఁడవై॥

-మార్తాండ జ్ఞానప్రకాశము



## 282 ప్రభుభోజనమున కాహ్వానము

రా - భైరవి (చాయ :పరిశుద్ధి పరిశుద్ధి పరిశుద్ధి యని) తా - త్రిపుట

మన యేసు మరణస్మా - రణవిందులోఁబాలు - గొనరండు ప్రియులార - వినయమానసులై = మన దోష చయమెల్లఁ - దనమేన ధరియించు - కొనిమనల గావ నా - యన పడిన శ్రమలెంచి ॥మన యేసు॥

1. మరల మన మధ్యకా - పరమాత్ముఁడరుదెంచ - వఱకాయనను మనము - మఱవకుండుటకై - స్థిర భక్తి నద్దాని - జరిగింపవలెనంచు - గురుతరంబగు నాజ్ఞ - నెఱపితాఁ జనెఁగాన ॥మన యేసు॥
2. తినుఁడిది యె నా దివ్య - తనువంచు నొక రొట్టి - యను వ్రచ్చి ప్రభుఁ డిచ్చె- ననుబంధుతతికి = ఘన శ్రద్ధదానిఁగై - కొని మనము - భుజియింప నొన గూడు జిరజీవ - మనుమాన మిఁకనేల ॥మన యేసు॥
3. ఆ రీతి నిజరక్త - ధారయై వెలయు ద్రా - క్షారసము నిచ్చె నిం - పార గొను డనుచుఁ = గోరి యా మధుధారఁ గ్రోలిన మనకుక్షి - దోరమౌ జీవంపుధార లుద్భవ మొందు ॥మన యేసు॥
4. ప్రభు భుక్తి నెవఁడు దై - వభయంబు లేక య - నుభవించు వానిక - శుభమౌ నా మీఁద = విభవంబు దొలఁగురో - గభయంబు చేకూరు - శుభ మవ్వానికి నెపుడు - లభియింపదని తెలిసి ॥మన యేసు॥
5. మిము మీరె తగురీతి - గమనించి పరిశోధ -నము చేసికొని మీ పాపము లొప్పుకొనుచు = నమితార్తిఁబశ్చాత్తా - పముఁబొంది యీ విందు - క్రమము బాటింప క్షే - మము మీకు సిద్ధించు ॥మన యేసు॥
6. దురితాంధకార భా - స్కరుఁడు సద్గురుఁడేసు - పరమవిందున కిది యను - ప్రాసంబని యెఱిఁగి = [1]ఉరణశాబకరక్త - సరి దంతఃపరిపూతాం - బరులైసత్కార్యత - త్పరులై బంధురమతులై ॥మన యేసు॥

– దాసరి మోజెస్

[1]గొఱ్ఱెపిల్ల రక్త ప్రవాహమున నుదుకబడిన వస్త్రములు గలవారై.